

# సంసారంలో సరిగమలు - తమస్విని



*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

## *అతడూ అతని కొడుకే..!*

**'శ్రీనివాసం' అపార్ట్‌మెంట్** ముందు ఆటో దిగి ఓసారి ఆ ఆరంతస్తుల భవనం వైపు చూసాను. పేరు శ్రీనివాసం కానీ అందులో నివాసం ఉండే అందరూ మధ్య తరగతి వాళ్ళేనని అర్ధమైపోతోంది. నేనుండేది తాత్కాలికమే కాబట్టి నాకు పెద్దగా ఇబ్బందేం లేదు.

ఆటో డ్రైవర్ నా రెండు పెద్ద సూట్‌కేస్‌లని దింపి డబ్బుతీసుకుని వెళ్ళిపోయాడు.

కొందరు ఆడవాళ్ళు కూరల బండి దగ్గర కూరగాయలు కొంటున్నారు.

"402లోకి వచ్చేది నువ్వేనామ్మా?" ఓ ముసలావిడ పలకరించింది.

"అవునండి" చెప్పి సూట్‌కేస్‌లతో లిఫ్ట్ వైపు నడిచాను.

రెండు బెడ్‌రూమ్స్ ఉన్న చిన్న అపార్ట్‌మెంట్ అది. ఛీప్‌గా కట్టారని తెలిసిపోతోంది. రంగులవాసన. తలుపులన్నీ తీసిపెట్టి నాతో తెచ్చుకున్న కొద్దిపాటి సామాను సర్దుకోవడం మొదలు పెట్టాను.

ఇందాకటి ముసలావిడ కూరలు నిండిన బుట్టతో 403లోకి వెళ్ళడం గమనించాను. బహుశా పక్క ఫ్లాట్‌లోకి నేను వస్తున్నానని వాచ్‌మేన్ చెప్పి ఉంటాడనుకున్నా.

ఐదు నిమిషాల తర్వాత ఆవిడ గుమ్మం దగ్గర నుంచుని అడిగింది.

"ఏమైనా కావాలామ్మా?"

"కొన్ని న్యూస్ పేపర్స్ ఉంటే ఇవ్వండి ఆంటీ. అలమరల్లో వేసి బట్టలు సర్దుకుంటాను." కోరాను.

ఆవిడ కొన్ని హిందూ పేపర్లు ఇచ్చి ఇంకేమైనా కావాలంటే అడగమని తలుపేసుకుంది. మంచి పొరుగే దొరికిందని నవ్వుకున్నాను.

ఓ అరగంట తర్వాత సన్నగా పొడుగ్గా ఉన్న ఓ ముసలాయన నిటారుగా నడుస్తూ ఆ ఫ్లాట్‌లోకి వెళ్ళాడు. ఆంటీ భర్త కాబోలు అనుకున్నా. పెద్దగా అరుపులు కేకలు వినిపించడంతో అదిరిపడ్డాను. ఆ ఫ్లాట్‌లోంచే.

"ఈ బురద మరకలేమిటి? దర్రిద్రుడు నీ మేనల్లుడు వచ్చాడా పొద్దున్నే? వాడికేం పనీపాటా లేదా? బూట్లు విప్పి లోపలకి రావడానికి బద్ధకం వెధవకి..".

ఆయన పెద్దగా అరుస్తున్నాడు. అంత సన్నటి మనిషికి అంత పెద్ద కంఠస్వరం ఉంటుందని ఎవరైనా చెపితే నమ్మేదాన్నికాదు.

ఆవిడ నెమ్మదిగా ఏదో నచ్చచెప్తోంది. ఆయన ఇంకా రెచ్చిపోయి అరుస్తున్నాడు. తలుపు మూసేసాను. కానీ బిల్డర్ ప్రతిభవల్ల పక్కనే మాట్లాడినట్లుగా వినిపిస్తున్నాయి ఆ సంభాషణలు. పాపం ఆవిడ నెమ్మదిగా ఉంది. ఆయనేంటో కారం తిన్నట్లు అరుస్తున్నాడు అనుకున్నాను.

కాఫీలో చక్కెర ఎక్కువైందని, న్యూస్ పేపర్లు నీట్‌గా సర్దలేదని. వాష్‌బేసిన్ అద్దం శుభ్రంగా లేదని టవల్ వాసన వేస్తోందని.. ప్రతీ ఉదయం ఆయన అరుపులే నాకు సుప్రభాతాలు. తిరగమోత గింజలు సరిగా వేగలేదు లాంటి సిల్లీ కారణాలకి కూడా ఆయన కొప్పెగిరిపోయేలా అరుస్తాడు. ఆవిడ ప్రమేయంలేని కొన్ని విషయాలకి కూడా ఆవిడే బలి. కూరలవాడు రేటు పెంచాడని, ఆఫీస్‌లో ఆయన కింద పని చేసినవాడు కనపడి, విష్ చేయకుండా పోయాడనీ, వార్తలు చూడడానికి లేకుండా కేబుల్ టి.వి వాడికి కరెంటు పోయిందని అన్నిటికీ ఆవిడమీద అరుస్తూనే ఉన్నాడు. ఆ అసంతృప్తులతో ఆయన మొహం ఎప్పుడూ ధుమధుమలాడుతూ ఉంటుంది. నుదుటి మీది చిరాకు రేఖలు పర్మినెంట్‌గా ఉండిపోయాయి.

ఆ రోజు ఉదయం ఆయన కంఠానికి దీటుగా మరో కంఠం యుగళగీతం అందుకోవడంతో ఉలిక్కిపడిలేచాను.

"ఐతే ఏమంటావు? అమ్మని నాతో పంపరా?" కొడుకు కంఠం అరుస్తున్నట్లుగా వినిపించింది.

"ఎందుకో?" ముసలాయన వ్యంగ్యంగా అడిగాడు.

"పిల్లలు నాయనమ్మని తీసుకురా అంటున్నారు"

"మరి తాతయ్య వద్దా?" అదే వ్యంగ్యం.

"నువ్వు ఏనాడైనా వాళ్ళని దగ్గరకి తీసావా నాన్నా?"

కొడుకు నిందాపూర్వకంగా అన్నాడు.

"తాతయ్య పులి, సింహం, దెయ్యం, రాక్షసుడు అని పిల్లలకి నూరిపోసి, నీ దగ్గరకి రాలేదంటే ఎట్లా వస్తార్రా?" ఆయన ఆక్రోశించాడు.

నాకు నవ్వొచ్చింది. తన సంగతి ఆయనకి తెలుసు.

"అమ్మా బట్టలు సర్దుకో" కొడుకు నిర్లక్ష్యంగా చెప్పాడు.

"ఏం నన్ను కూడా పిలవచ్చుగా?" ఉడుక్కున్నాడాయన.

"బాంబేలో నేనుండేది హైరైజ్ అపార్ట్‌మెంట్స్‌లో నాన్నా. నువ్వింత పెద్ద గొంతుతో అరుస్తూంటే, పక్క వాళ్ళు పోలీసులని పిలుస్తారు. నువ్వేమో కోపం వస్తే, ఎక్కడున్నామో, చుట్టుపక్కల ఎవరున్నారో కూడా పట్టించుకోవు.."

"ఆహా! తమరి కంఠం మాత్రం తక్కువా?"

"మీ దగ్గరికి వస్తేనే నా గొంతు లేస్తుంది. ఇంతకీ అమ్మని పంపుతావా లేదా?" అతను అసహనంగా అరిచాడు.

"నాన్నకి ఇబ్బంది అవుతుంది నాన్నా. ఇంకోసారి ఇద్దరం వస్తాంలే." ఆవిడ అనునయంగా చెప్పింది.

"చూడమ్మా! ఈనెల పదిహేనుకి నేను, మీ కోడలు సింగపూర్ ట్రిప్‌కి వెళ్తున్నాం. నువ్వొచ్చి పిల్లల్ని చూసుకోవాలి." కొడుకు చెప్పాడు.

"అదీ సంగతి! ఆయా కమ్ వంటమనిషి పనికి మీ అమ్మకావాలి. మళ్ళీ ఏదో ప్రేమ కారిపోతున్నట్టు బిల్డప్" ఆయన వెటకారంగా నవ్వాడు.

"ఈ సారికి మీ అత్తగారిని రమ్మను. నేను రాలేను" ఆవిడ దృఢంగా చెప్పింది.

ధన్‌మనే చప్పుడుతో తలుపు మూసుకుంది.

"ఒరేయ్ బాబూ, నాన్నా." ఆంటీ పిలుపు వినిపించింది.

"ఏం కొడుకుని కన్నావే. తల్లితండ్రులమీద దయలేని పుత్రుడు" ఆయన ఆవిడని అరవడం మొదలెట్టాడు.

పదిరోజులు అమ్మ దగ్గర గడిపి, శ్రీనివాసం ముందు ఆటో దిగగానే, సూట్‌కేస్  అందుకుంటూ వాచ్‌మేన్ చెప్పాడు.

"పరమశివంగారు పోయారమ్మా."

"ఆయనెవరూ?" అర్థంకాక అడిగాను.

"మీ పక్కన 403 ఆయన."

"ఓ! ఆయనా? ఎలా?" నాకేం సానుభూతి కలగలేదు.

"మీరు వెళ్ళిన ఒకటి రెండురోజులకే. రాత్రి పడుకున్న ఆయన మర్నాడు లేవలేదు."

"మంచి చావే వచ్చింది. ఆంటీ బాంబే వెళ్ళిపోయారా?"

"లేదమ్మా. కొడుకు రమ్మన్నా రానంది. దాంతో ఆయన కొప్పుగిరిపోయేలా అరిచి జన్మలో నీ మొహం చూడను, నువ్వు చచ్చినా రాను అని తిట్టివెళ్ళాడు."

ఇంతకంటే ఎక్కువ సమాచారం వాచ్‌మేన్ ద్వారా వినడం ఇష్టం లేక లిఫ్ట్ వైపు నడిచాను.

సూట్‌కేస్ ఇంట్లో పెట్టి, పక్క ఫ్లాట్ బెల్ నొక్కాను. ఈ ఆర్నెల్ల కాలంలో నేనెన్నడూ ఆ ఇంట్లో అడుగుపెట్టలేదు.

"ఎవరది? తలుపు తీసే ఉంది. లోపలకి రండి" ఆంటీ కంఠం వినిపించింది.

తలుపు తోసుకుని లోపలకి వెళ్ళాను. హాలంతా శుభ్రంగా ఉంది. ఇల్లు సాంబ్రాణి వాసన వేస్తోంది. దివాన్ మీద పడుకున్న ఆంటీ నెమ్మదిగా లేస్తోంది. పక్కన పాత చందమామ బోర్లించి ఉంది.

"నువ్వా? రామ్మా" ఆదరంగా పిలిచింది.

"సారీ ఆంటీ" ఏం మాట్లాడాలో అర్థం కాలేదు.

"ఏం పర్లేదమ్మా. ఎవరం కాలానికి అతీతులం కాదుకదా. కాకపోతే ఏంటంటే, పాపం మీ అంకుల్ని తలుచుకుంటే ఒక విషయంలో బాధేసింది." చెప్పిందావిడ.

"ఏమిటాంటీ?"

"కృష్ణశాస్త్రిగారు 'నా కొరకు చెమ్మగిల్లు నయనమ్ము లేదు' అని రాసారు. నీకు తెలియకపోవచ్చు బహుశా. ఆ విధంగా పరమశివంగారి కోసం చింతించిన వాళ్ళే లేరు నాతో సహా. మరి ఆయన ఏం సాధించినట్లు?"

నిట్టూర్చింది.

"ఆంటీ మీ అబ్బాయి దగ్గరకి వెళ్తన్నారట. అతనికి కోపం..."

"... ఏభై ఏళ్ళ తర్వాత దొరికిన స్వేచ్ఛని పోగొట్టుకుంటానా చెప్పు? సదాశివం పరమశివం కొడుకే!" అంటే తెరిపిగా నవ్వింది.

*(వచ్చే సంచికలో మరో సరిగమ)*

Click here to share your comments on this story